కూలేందుకు సిద్ధంగా..

- బ్రిటీష్ హయాంలో సాగునీటి వంతెన నిర్మాణం
- నేడు శిథిలావస్థకు చేరుకున్న వైనం
- కూలిపోతే మాగాణి ఎడారే..
- ఆందోళనలో అన్నదాతలు

మండల కేంద్రమైన మనుబోలులోని మాగాణి పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే వంతెన శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ముందుచూపుతో వ్యవహరించాల్సిన ఇరిగేషన్ అధికారులు దీని గురించి పట్టించుకోవడం మానేశారు. ఏ క్షణంలో అయినా కూలేలా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న వంతెన

మనుబోలు: మనుబోలులోని 90 శాతం మాగాణి పొలాలకు నీటి వంతెన గుండానే సాగునీరు సరఫరా అవుతోంది. మనుబోలు పెద్ద చెరువు నుంచి పొలాలకు వెళ్లే పంట కాలువకు అడ్డుగా కండలేరు ఉప కాలువ ఉంది. పంట కాలువలోని నీరు కండలేరు వాగును దాటేందుకు బ్రిటీషర్ల కాలంలో వంతెన నిర్మించారు. వంతెన పైన కాలువలా ఏర్పాటు చేయడంతో నీరు కండలేరు వాగు అవతలి వైపునకు చేరుకుని తిరిగి పంట కాలువలో కలుస్తుంది. దీనిని గ్రామస్తులు అట్టిడి అని పిలుస్తుంటారు. అయితే కొన్నేళ్లుగా ఇది శిథిలావస్థకు చేరుకుని పలు చోట్ల లీకులు ఏర్పడి నీరు వృథా అవుతోంది.

దెబ్బతిని..

అసలే అంతంతమాత్రంగా ఉన్న ఈ వంతెన 2015 నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో బాగా దెబ్బతింది. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇది కూలిపోతే మనుబోలులోని సుమారు 1,200 ఎకరాలకు సాగునీరు అందకుండా పోతుంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టాలని, ప్రస్తుతం లీకులకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



లీకవుతున్న నీరు



పారుతున్న సాగునీరు

సాగునీరు వృథా అవుతోంది



చాలా ఏళ్లుగా అట్టిడి శిథిలావస్థలో ఉంది. ఏదైనా జరిగి కూలిపోకముందే జాగ్రత్త వహించాలి. లీకుల కారణంగా సాగునీరు వృథాగా పోతుంది. దీంతో పంట ఆఖరి దశలో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– బొమ్మిరెడ్డి ధనంజయరెడ్డి, రైతు, మనుబోలు

కొత్తది నిర్మించాలి



తాత్కాలిక మరమ్మతుల వల్ల ఉపయోగం లేదు. ఇది పూర్తిగా కూలిపోకముందే పక్కనే కొత్తగా వంతెన నిర్మించాలి. ఇప్పుడున్న అట్టిడి కూలిపోతే సాగు నీరందక వెయ్యి ఎకరాలకు పైగా ఎడారిగా మారే ప్రమాదం ఉంది.

– కలికి వెంకటస్వామిరెడ్డి, రైతు, మనుబోలు

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం



పొదలకూరు: స్వాతి నక్షత్రం సందర్భంగా స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీలక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉభయ కర్తలుగా శ్రీనివాసులు – రజని, వెంకటేష్ – అలేఖ్య, సుజీవన్ – అనూష దంపతులు వ్యవహరించారు.

నేడు నారాయణ స్వామి ఆరాధన మహోత్సవం

పొదలకూరు: పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప దేవగిరి క్షేత్రం వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు శ్రీనారాయణస్వామి 17వ ఆరాధన మహోత్సవాలు బుధవారం జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం వెల్లడించారు. వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి వీసీకి ఘన సన్మానం



విజయభాస్కరరావుకు సన్మానం

వెంకటాచలం: మండల పరిధిలోని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సేవలందించిన ఆచార్య విజయభాస్కరరావుకు మంగళవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వీడ్కోలు సభను నిర్వహించారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీహెచ్ విజయ, కావలి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో ఆంగ్ల భాషోత్సవాలు



విద్యార్థులతో డిబేట్ నిర్వహిస్తున్న టీచర్లు

పొదలకూరు: విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఆంగ్ల భాష ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సనత్‌కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. పాఠశాల ఆంగ్ల భాష సహాయకుడు రాజ్‌కుమార్ ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు పిల్లలతో డిబెట్ నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు ఏవీ సుధాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. పల్లకి సేవ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ఆక్రమణల తొలగింపు



విడవలూరు: విడవలూరులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను కోర్టు ఉత్తర్వుల మేరకు సంబంధిత అధికారులు మంగళవారం తొలగించారు. ఆర్ అండ్ బీ, రెవెన్యూ, సర్వే, పంచాయతీ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు. అయితే అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారి ఇళ్లను వదిలేసి, ఇతరుల గృహాలు, దుకాణాలను కూల్చేశారని పలువురు ఆరోపించారు. కొన్ని చోట్ల దుకాణదారులే స్వచ్ఛందంగా తొలగించుకోగా, మరి కొన్ని చోట్ల వాగ్వాదాలు జరిగాయి. మరికొన్ని చోట్ల మార్కింగ్ వేసినా కూల్చకుండా వదిలేశారు.

'డీకేడబ్ల్యూ'లో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ఏపీఎస్సెస్డీసీ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో 30 సీట్లున్నాయని, 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి పదో తరగతి లేదా ఆపై చదివిన మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగాన్ని కల్పించనున్నారని, వివరాలకు 86398 67407 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్పీఐ నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు సిటీ: గాంధీబొమ్మ సమీపంలోని రెవల్యూషనరీ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాబూ అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పట్టపు రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా నేనావత్ రవినాయక్, ప్రసన్నకుమార్, మధు, మహదేవ, సుబ్బారావు, పోలయ్య, నౌషాద్, జిల్లా కార్యదర్శులుగా గంటాజాన్ కిరణ్, వజ్జా సుధాకర్, ఒజిలి భాస్కర్, దాసరి రత్నం, నాగూర్ ఎన్నికయ్యారు. అదే విధంగా వివిధ పదవులకు పలువుర్ని ఎన్నుకున్నారు. నేతలు ఆరికొండ సురేష్, కోవూరు సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

పొదలకూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) షేక్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ ఉర్దూ పాఠశాలను మంగళవారం డీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉర్దూ స్కూల్లో పిల్లలు తక్కువ సంఖ్యలో ఉన్నారని, పెంపొందించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, స్కూల్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఐ వెంట హెచ్ఎం అబ్దుల్ ఖాదర్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఖాజామొహిద్దీన్

మార్చి నెలాఖరులోపు రీసర్వే పూర్తి

మనుబోలు: మార్చి నెలాఖరులోపు మండలంలో రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య సూచించారు. మండలంలోని పిడూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిడూరు రెవెన్యూ పరిధిలో 4,800 ఎకరాల భూమి ఉందన్నారు. వెయ్యి ఎకరాలు సర్వే చేశారని తెలిపారు. రీసర్వేలో ఎక్కడైనా తప్పులు దొర్లి ఉంటే సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏ పద్మమ్మ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

రైతులకు పరిహారం ఇవ్వాలి

పొదలకూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓ అనిల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదలకూరు మండలం దుగ్గుంట, వావింటపర్తి, అంకుపల్లి గ్రామాల్లో రైల్వే లైన్ సర్వే నిర్వహించి ఆరు సంవత్సరాలు పూర్తయ్యిందని, భూ సేకరణకు మార్కింగ్ ఇచ్చి సర్వే రాళ్లు కూడా నాటినట్టు తెలిపారు. అయితే పరిహారం అందజేయడంలో తీవ్రజాప్యం నెలకొన్నట్టు వెల్లడించారు. కొందరు రైతులు పరిహారం తక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. వెంటనే పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికుమార్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

'జ్ఞానజ్యోతి'పై అంగన్‌వాడీలకు శిక్షణ

మనుబోలు: జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీలకు మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య ద్వారానే చిన్నారుల భవితకు పునాది ఏర్పడుతుందన్నారు. పిల్లల మానసిక స్థాయిని దృష్టిలో ఉంచుకుని ఆటపాటల ద్వారా వారికి విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేష్ కుమార్, హెచ్ఎం డేవిడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, ఉపాధ్యాయులు హరేందర్‌రెడ్డి, రామకృష్ణ, రోశయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

⇨ **పొదలకూరు:** స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ – 1 కె.రేణుక, ఎంఈఓ – 2 శోభనాద్రి హాజరై కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరించారు. ఆర్పీలుగా కె.శీనయ్య, కల్యాణ్, ఖాదర్‌బాషాలను ఎంపిక చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లల విద్యను బలోపేతం చేయడమే జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమ లక్ష్యమని ఏసీడీపీఓ, కీ రిసోర్స్ పర్సన్ అరుణ పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. వీటిని పరిశీలించేందుకు వచ్చిన ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు విద్యాపరంగా మెరుగైతే, పాఠశాలల్లో చేరే సమయానికి వెనుకబాటుతనం ఉండదన్నారు. ఎంఈఓలు వసంత కుమారి, అంకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, చంద్రశేఖర్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** అంగన్‌వాడీల బలోపేతమే జ్ఞానజ్యోతి లక్ష్యమని ఎంఈఓ – 2 సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సుబ్బరత్న, లలితాంబ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: సూచనలిస్తున్న అరుణ



ఇందుకూరుపేట: నరసాపురంలో..

డిగ్రీ పరీక్షలకు 121 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన రెండో సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షలకు 216 మందికి గానూ 121 మంది హాజరైనట్లు ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు.

పోలేరమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో చిట్టేపల్లి గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి ఊరేగింపుగా విచ్చేసి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన



కొడవలూరు: క్షయపై అవగాహన పెంచాలని కొడవలూరు వైద్యాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. క్షయపై మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. సరైన అవగాహన లేని కారణంగా క్షయ వ్యాప్తి చెందుతోందని చెప్పారు. టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఎమ్మెల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎంలు హిమజ, సలోమి, హెచ్ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

బుచ్చిరెడ్డిపాళెం: స్వయం ఉపాధి పథకం ద్వారా రుణాల మంజూరుకు గానూ ఇంటర్వ్యూలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధ, గురువారాల్లో నిర్వహించనున్నామని ఎంపీడీఓ శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2024 – 25కు సంబంధించి బీసీ, ఈబీసీ – కాపు, రెడ్డి కమ్మ, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకం రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహించి సర్టిఫికెట్లను పరిశీలించనున్నామని వివరించారు.

⇨ రేబాల, మునులపూడి, నాగాయగుంట, నాగమంబాపురం గ్రామాల వారికి బుధవారం ఉదయం 10.30కు.. ఇస్కపాళెం, పంచేడు, చెల్లాయపాలెం వాసులకు మధ్యాహ్నం 2.30కు నిర్వహించనున్నామని తెలిపారు.

⇨ దామరమడుగు, కాళయకాగొల్లు వాసులకు గురువారం ఉదయం 10.30కు.. జొన్నవాడ, పెనుబల్లి, మినగల్లు వారికి మధ్యాహ్నం 2.30కు నిర్వహించనున్నామని చెప్పారు. తమ ఒరిజినల్ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ ఇతర సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

గాంధీ ఆశ్రమంలో పరిశీలన



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో గల పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని తహసీల్దార్ కృష్ణప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ భానుమతి మంగళవారం పరిశీలించారు. ఆశ్రమంలోని మామిడి తోటకు సంబంధించిన బహిరంగ వేలంపై ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కమిటీ సభ్యులతో చర్చించారు. తొలుత గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు నివాళులర్పించారు. ఉద్యానశాఖ అధికారి ప్రసన్న, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదినారాయణ, కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, రామిరెడ్డి, సుమంత్‌రెడ్డి, మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర

పొదలకూరు: కూటమి ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సక్రమంగా అందించలేకపోతోందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో అందకపోవడంతో కళాశాలల యజమాన్యాలు హాల్‌టికెట్లను ఇవ్వడం లేదన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలలకు మార్చి 5 నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు, 8వ తేదీ నుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఉన్నట్టు తెలిపారు. మొత్తం బకాయిలు రూ.3,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. డిగ్రీ విద్యార్థులకు ఇప్పటి వరకు విద్య, వసతి దీవెనపై స్పందన లేకపోవడం దారుణమన్నారు.



నూతన కార్యవర్గం

మండల కమిటీ

ఈ సందర్భంగా మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మోక్ష, కార్యదర్శిగా ఎస్‌కే మస్తాన్‌వలీ, ఉపాధ్యక్షులుగా రాజేష్, వికాస్, కిశోర్, వినయ్, మనోజ్, సహాయ కార్యదర్శులుగా నవీన్, ప్రదీప్, పవన్, సాయి, కమల్, ఆరీఫ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కె.పెంచలనర్సయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బి.మనోహర్, రషీద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న సుజాత



ఇందుకూరుపేట: లేబూరులో..

కొడవలూరు: రైతులకు విశిష్ట సంఖ్య అవసరమని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. కొడవలూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని సేవలు విశిష్ట సంఖ్య ఆధారంగానే అందుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. సొంత పొలమున్న రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలంటే పంట నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీని పూర్తి చేసి ఉండాలని సూచించారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏ కవిత పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: సొంత భూమి కలిగిన రైతులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే రిజిస్ట్రేషన్‌ను తప్పక చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని లేబూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు 11 అంకెలతో కార్డు లభించనుందని వివరించారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, వీఏఏ సుమ తదితరులు పాల్గొన్నారు.